దిన పత్రిక
తొలి సమయం
శనివారం । 23 । మే । 2026

## బాధిత కుటుంబానికి అండగా సర్పంచ్ గొంది సోనీ రాజు




తొలి సమయం కొత్తగూడ 22 మే 2026

కొత్తగూడ మండలంలోని జంగావానిగూడెం (రాంపూర్) గ్రామానికి చెందిన ఈక సమ్మయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన స్థానిక సర్పంచ్ గొంది సోనీ రాజు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యం కల్పించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సూచనల మేరకు సమ్మయ్య దశదినకర్మ కార్యక్రమంలో భాగంగా కుటుంబానికి 50 కేజీల సన్నబియ్యాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గొంది సోనీ రాజు మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్, జంపయ్య, మహేందర్, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శ్రీనివాస్, బంగారి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు

తొలి సమయం కొత్తగూడ 22 మే 2026

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" జిల్లా స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కుడా ఛైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు , వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ , హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్ పేయ్ గారితో కలిసి పాల్గొన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద మంజూరైన పత్రాలు, ఆర్థిక సహాయాలు, సంక్షేమ ఫలాలను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, పేదల జీవన ప్రమాణాల పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా పారదర్శకంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వెంటనే పరిష్కరించే దిశగా "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి



పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామాలు, పట్టణాలు సమానంగా అభివృద్ధి చెందేలా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, సంక్షేమం మరియు



అభివృద్ధి రెండింటినీ సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్ పేయ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత చురుకుగా పని చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జూన్ 3న సభను విజయవంతం చేయాలి

## బైక్ ర్యాలీతో గ్రామాల్లో ప్రచారం





తొలి సమయం కొత్తగూడ 22 మే 2026

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పునుగొండ్ల కామారం ప్రాంతాల్లో ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించనున్న "జూన్ 3 చలో పాకాల కొత్తగూడ" బహిరంగ సభకు మద్దతుగా తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీ పగిడిద్దరాజు సన్నిధి నుంచి ప్రారంభమై గ్రామ గ్రామాన ప్రచారం చేస్తూ గంగారం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ కోయ జాతి ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రతి ఆదివాసీ ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఆదివాసీ హక్కులను తాకట్టు పెట్టే నాయకత్వాన్ని ప్రజలు తిరస్కరించాలని అన్నారు. "కోయ తెగ సంప్రదాయాలను గౌరవించే వారే ఆదివాసీల నిజమైన నాయకులు" అని పేర్కొన్నారు.పునుగొండ్లకామారం గ్రామాల్లో చెట్ల కింద గ్రామస్తులతో నిర్వహించిన సమావేశాల్లో డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, "ఆదివాసీల అస్తిత్వం నిలవాలంటే పోరాటమే శరణ్యం. జాతి హక్కుల కోసం చేసే ఉద్యమంలో నిబద్ధతతో ముందుకు సాగాలి" అని అన్నారు. 46 డిగ్రీల తీవ్ర ఎండలను సైతం లెక్కచేయకుండా గ్రామాల వారీగా పర్యటిస్తూ యువతలో ఉద్యమ స్ఫూర్తి నింపుతున్నామని చెప్పారు.జూన్ 3న పాకాల కొత్తగూడలో నిర్వహించే భారీ సభను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామం నుంచి ఆదివాసీ యువకులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. "సమస్య వ్యక్తిగతం కాదు జాతి సమస్య. ప్రతి ఒక్కరూ ఆలోచించి కొత్తగూడకు కదలిరావాలి" అని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ కళా సమితి రాష్ట్ర నేత ఉణేని మధు, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తీ శేఖర్, ఏటీఎఫ్ నేతలు కల్తీ ఎల్లయ్య, చాట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి వేడిమిపై ప్రజలకు పోలీసుల అవగాహన

### అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దు ఎస్ఐ రాజ్‌కుమార్ సూచన

తొలి సమయం కొత్తగూడ

కొత్తగూడ మండలంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడ ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నందున ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో అవసరం లేకుండా బయట తిరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు.వేసవి ఎండల ప్రభావంతో వడదెబ్బలు, నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎండకు ఎక్కువగా గురికాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితులు తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు.బైక్‌పై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని ఎస్ఐ తెలిపారు. అలాగే బైక్‌లు, కార్లలో ఇంధనాన్ని పూర్తిగా ఫుల్ ట్యాంక్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎండల కారణంగా వాహనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.ప్రజలు తరచూ తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు వంటి ద్రవపదార్థాలు




తీసుకోవాలని సూచించారు. ఎండలో పనిచేసే వారు తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం మంచిదన్నారు. నీరసం, కళ్లు తిరగడం, అధిక చెమటలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని సూచించారు.ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి వేసవి తీవ్రతను ఎదుర్కోవాలని కొత్తగూడ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# వేలుబెల్లి పెద్ద చెరువులో చేపల జాతర..!

### - కాకతీయుల కాలం నాటి చెరువులో తెల్లవారుజామునే సందడి చేసిన ప్రజలు

తొలి సమయం కొత్తగూడ 22 మే 2026

కొత్తగూడ మండలంలోని వెలుబెల్లి గ్రామంలో ఉన్న కాకతీయుల కాలం నాటి చారిత్రాత్మక పెద్ద చెరువు ఆదివారం ఉదయం సందడితో కళకళలాడింది. వేసవి ఎండల తీవ్రతతో చెరువులో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోవడంతో చెరువు నిర్వాహకులు చేపలు పట్టుకునేందుకు ప్రజలకు అనుమతి ఇవ్వడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. తెల్లవారుజామునే చెరువు వైపు ప్రజల రాక ప్రారంభమైంది. ఉదయం 5 గంటలకే యువకులు, మత్స్యకారులు, గ్రామస్తులు వలలు, బుట్టలు, గాలాలతో చెరువులోకి దిగుతూ చేపల వేట ప్రారంభించారు. చెరువు చుట్టూ ప్రజల కేరింతలు, వలలు విసురుతున్న దృశ్యాలు, చేపలు పట్టేందుకు ఒకరితో ఒకరు పోటీ పడుతున్న యువకుల ఉత్సాహం అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సూర్యోదయ సమయంలో చెరువుపై పరుచుకున్న బంగారు కిరణాలు ఆ ప్రాంతాన్ని మరింత అందంగా మార్చాయి. చేపల వేటలో నిమగ్నమైన ప్రజలకు సూర్యుడు వెలుతురు అందిస్తూ సహకరిస్తున్నట్టుగా కనిపించిన ఆ దృశ్యం ప్రకృతి అందాలను తలపించింది.



చెరువులో నీరు తగ్గిపోవడంతో చేపలు సులభంగా దొరకడం వల్ల పలువురు మంచి మొత్తంలో చేపలను పట్టుకుని ఆనందం వ్యక్తం చేశారు.వెలుబెల్లి పెద్ద చెరువు వద్ద నెలకొన్న సందడి చిన్నపాటి జాతరను తలపించింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొనగా, మహిళలు కూడా చెరువు వద్దకు చేరుకుని చేపల వేటను ఆసక్తిగా వీక్షించారు. కొందరు యువకులు చెరువులో చేపలు పట్టిన దృశ్యాలను తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పంచుకున్నారు.కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చెరువు గ్రామానికి మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాలకు కూడా జీవనాధారంగా నిలుస్తోందని స్థానికులు తెలిపారు. ఒకవైపు చారిత్రక ప్రాధాన్యతను చాటుకుంటూనే, మరోవైపు ప్రజలకు ఉపాధి, ఆహార వనరుగా ఉపయోగపడుతున్న వెలుబెల్లి పెద్ద చెరువు మరోసారి ప్రజలతో కళకళలాడింది.

